క్లుప్తంగా

మున్సిపాలిటీలో మెప్మా మార్కెట్



మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా స్టాళ్లు

పుంగనూరు: మెప్మా అధికారులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా అమ్మకాల నిమిత్తం పది స్టాళ్లను ఏర్పాటు చేశారు. వివిధ మహిళా గ్రూపుల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులను ఇక్కడ అమ్మకాలకు పెట్టినట్టు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సజ్జ, జొన్న రొట్టెలు, సహజసిద్ధంగా పండించిన కూరగాయాలు, ఆకుకూరలతోపాటు పిల్లలు ఆడుకునే బొమ్మలు, వివిధ రకాల తినుబండారాలు, ఎంబ్రాయిడింగ్ జాకెట్లు, చీరలు, చిన్నపిల్లల డ్రెస్సులు..ఇలా పలు రకాలైనవి విక్రయానికి పెట్టామని, ప్రజల నుంచి ఆదరణ లభిస్తే ఈ స్టాళ్లను కొనసాగిస్తామన్నారు. మహిళలను వ్యాపార రంగంలో అభివృద్ధి చేసేందుకు మెప్మా మార్కెట్ ఒక వేదికగా దోహద పడుతుందని ఆయన చెప్పారు. ఒక్క రోజులోనే రూ.20 వేలవరకు విక్రయాలు చేశారని తెలిపారు.

రాతి పనులకు అనుమతివ్వరూ!

- కడా పీడీకి వడ్డెరల వినతి

కుప్పం: నియోజకవర్గంలోని రాళ్ల పనులు చేసుకునేందుకు తమకు అనుమతులు ఇవ్వాలని కడా పీడీకి వడ్డెర కులస్తులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కడా పీడీని వడ్డెరలు మున్సిపాలిటీలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు వడ్డెర కులస్తులు కలిశారు. తమకు రాతి పనులే జీవనోపాధి అని, అయితే చేతి పనులు చేసే కార్మికులు ప్రభుత్వ నిబంధనల పేరిట తమను ఇబ్బందులు పెడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కడా పీడీ ఆదేశించారు.

అంటు కట్టు విధానంతో అధిక దిగుబడి



సదస్సులో మాట్లాడుతున్న బ్రహ్మదేవ్

కుప్పంరూరల్: అంటు కట్టు విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు ఎంబసీ బ్రహ్మదేవ్ అన్నారు. కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ)లో జరుగుతున్న అధికారులు, రైతుల జాతీయ సదస్సులో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంటు కట్టు విధానం, హైడ్రోఫోనిక్స్ (మట్టి అవసరం లేకుండా నీటితోనే) పండించే పంటల సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వాతావరణ మార్పులు, మార్కెట్‌కు అనుకూలంగా పంటల సాగు చేపట్టాలన్నారు. అంటు కట్టిన మొక్కలు మొదట కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లోనే చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం ఇది దేశం మొత్తం పాకిందన్నారు. అంటుకడితే కాండం బలంగా తయారై వాతావరణ మార్పులు, అధిక నీటిని సైతం తట్టుకుందని చెప్పారు. అంతే కాకుండా దిగుబడి రెట్టింపు అవుతుందని చెప్పారు. ప్రస్తుతం కొత్తరకం మట్టి అవసరం లేకుండా హైడ్రో ఫోనిక్స్‌తో పంటల సాగు విప్లవం మొదలైందన్నారు. ఇప్పుడిప్పుడే దేశంలో అక్కడక్కడ ఇలాంటి సాగు చేపడుతున్నారని, పూర్తిస్థాయిలో చేపడితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, కుప్పం సీఓఈ 2019 జనవరి 2న ప్రారంభించడం జరిగిందని, స్కాచ్ అవార్డు రావడం సెంటర్ పనితీరుకు నిదర్శనమన్నారు. అనంతరం 50 శాతం రాయితీపై ఇచ్చే పవర్ ట్రిల్లర్లు, రొటోవేటర్లు, స్ప్రేయర్లు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు, సత్యేంద్రశేఖర్, ఏడీ కోటేశ్వరరావు, ఉద్యానవనశాఖాధికారి డింపు ప్రియ పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



డాక్టర్లతో మాట్లాడుతున్న కేంద్ర బృంద అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం కేంద్ర బృంద అధికారి డాక్టర్ పర్వీన్ సుల్తానా తనిఖీ చేశారు. అలాగే సబ్‌సెంటర్లను సందర్శించారు. వివిధ జాతీయ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణపై ఆరా తీశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని కుటుంబ నియంత్రణ రికార్డులు, ప్రసవానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు ఉషశ్రీ, హనుమంతరావు, జానకీరావ్, ప్రశాంతి, కేటీ ప్రసాద్, రామ్మోహన్ పాల్గొన్నారు.

బురిడీ గోల్డ్ లోన్ బ్యాంకులు!



జిల్లాలో జనాన్ని ఏమార్చే బురిడీ గోల్డ్ బ్యాంకులు పుట్టగొడుగుల్లా వెలుస్తూ కుచ్చుటోపీ పెడుతున్నాయి. ప్రభుత్వ బ్యాంకులు ఇచ్చే గ్రాము బంగారు ధర కంటే తాము ఎక్కువగా డబ్బులిస్తామని ఊదరగొడుతుండడంతో అవసరాల నిమిత్తం ఇలాంటి ప్రైవేటు బ్యాంకుల్లో తనఖా పెట్టి, చివరకు మోసపోతున్నారు. ఇటీవల పుంగనూరు, పలమనేరుల్లో ఈ తరహాలో ఓ బ్యాంకు రూ.8 కోట్ల అక్రమాలకు పాల్పడింది. ఇందులో పలమనేరులో జరిగిన అక్రమాలు రూ.2.80 కోట్లు ఉన్నట్టు ఆడిట్‌లో వెలుగు చూసింది. దీనిపై పుంగనూరులో బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేస్తుండగా, పలమనేరులో బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో ఇక్కడ జరిగిన అక్రమాలపై పోలీసులు నిగ్గు తేల్చే పనిలో పడినట్టు తెలుస్తోంది.

అక్రమాలు జరిగిన పలమనేరులోని ప్రైవేటు బంగారు తనఖా బ్యాంకు



- గ్రాము బంగారు ధరలో 90 శాతం రుణాలిస్తామని ఆఫర్
- వీరిమాట నమ్మి బ్యాంకులో నగలు పెడితే ఆపై మోసం
- తాజాగా ఇక్కడి ఓ గోల్డ్‌లోన్ బ్యాంకులో రూ.2.80 కోట్ల మోసం
- ఇదంతా ఇంటిదొంగల పనేనని ఆడిట్‌లో తేలిన వైనం
- ఇప్పటికే పుంగనూరులో ఆరుగురి సిబ్బందిపై కేసులు
- పలమనేరు శాఖ సిబ్బందిపై త్వరలో కేసులకు రంగం సిద్ధం

పలమనేరు: సాధారణంగా ప్రభుత్వ బ్యాంకులు గ్రాము బంగారు ధరపై అత్యధికంగా 80 శాతం వరకు రుణాలిస్తాయి. అయితే దీనికంటే ఎక్కువగా ఆశ జూపి బంగారాన్ని తాకట్టు పెట్టుకునేందుకు ప్రైవేటు గోల్డ్ కంపెనీ బ్యాంకులిస్తున్నాయి. తాజాగా బంగారు గ్రాము ధర రూ.7,540 దాకా ప్రస్తుతం ఉంది. ఆమేరకు ప్రభుత్వ బ్యాంకులు బంగారంపై గరిష్టంగా రూ.5500 దాకా రుణం ఇస్తుండగా, ప్రైవేటు బంగారు తాకట్టు బ్యాంకులు రూ.7వేల వరకూ ఇచ్చి ఆపై టోకరా పెడుతున్నాయి.

రెఫర్ చేసేవారికి స్పాట్ కమీషన్లు

ఈ ప్రైవేటు గోల్డ్‌లోన్ బ్యాంకులకు ఎవరినైనా సిఫార్సు చేసి ఏజెంట్లు పంపితే చాలు. రుణగ్రస్తుడు పెట్టిన రుణం మేరకు నిర్ణయించిన కమీషన్ ఆయా ఏజెంట్ సెల్‌కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా లోన్ ఇచ్చిన కాసేపటికే అందుతోంది. దీంతో చాల మంది ఏజెంట్లుగా మారి ప్రభుత్వ బ్యాంకులో బంగారు రుణాలను తీసుకోకుండా ఇలాంటి బురిడీ బ్యాంకులకు రుణాలను తీసుకునే వారిని పంపుతూ కమీషన్లు పొందడం ఇక్కడో లాభసాటి వ్యవహారంగా మారింది.

మొత్తం అక్రమాలు ఇంటి దొంగల పనే!

ఇలాంటి మోసాలకు పాల్పడే బంగారు తనఖా బ్యాంకుల్లో మేనేజర్, సిబ్బందితోపాటు గోల్డ్ అప్రైజర్ సైతం ఓ ముఠాగా ఉన్నట్టు పుంగనూరు ఉదంతంతో వెలుగుచూసింది. ఈ బ్యాంకులోని సిబ్బంది తమ బంధువుల ద్వారా భారీగా నకిలీ బంగారాన్ని వీటిలో తనఖా పెట్టించి కోట్ల మొత్తంలో కొట్టేయడం గమనార్హం! దీన్ని బట్టి చూస్తే ఇదే తరహాలో పలమనేరులోనూ జరిగింది. ఇక్కడి బ్యాంకులోని సిబ్బందే సూత్రధారులు, పాత్రధారులుగా ఉన్న విషయం బట్టబయలైంది. పుంగనూరు బ్రాంచిలో ఇలాంటి అక్రమాలు జరిగాయంటూ గత ఏడాది డిసెంబర్‌లోనే అక్కడి పోలీసులకు ఫిర్యాదులందినా ఆడిట్‌లో అక్రమాలు తేలే వరకూ పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. ఆపై అక్కడికి చెందిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇదే విధంగా పలమనేరు బ్రాంచికి సంబంధించి బాధితులు ఇప్పటికే పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా స్పందించలేదని సమాచారం. ఇప్పుడు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేయడంతో స్థానికంగానూ కేసులు పెట్టాల్సిన పరిస్థితి కలిగింది. ఏదేమైనా ఇలాంటి బోగస్ బంగారు తనఖా బ్యాంకుల బారిన పడి జనం మోసపోరాదని పలువురు ప్రభుత్వ బ్యాంకుల మేనేజర్లు చెబుతున్నారు.

భారీగా వెలుస్తున్న ప్రైవేటు బంగారు తనఖా బ్యాంకులు

ఎక్కడో హెడ్ ఆఫీసు ఉంటూ స్థానికంగా బంగారు రుణాలను తాకట్టు పెట్టుకునే ప్రైవేటు బ్యాంకులు జిల్లాలో 50 వరకూ ఉన్నట్టు తెలుస్తోంది. పెద్దగా జన సంచారం లేని చోట ఇవి వెలుస్తున్నాయి. గతంలో ఏదేనీ ప్రైవేటు బ్యాంకులో పనిచేసిన సిబ్బందికి వీరు అందులో ఉద్యోగాలిచ్చి వారితో మొత్తం లావాదేవీలను నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

రథసప్తమి పూజలకు ముస్తాబు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయాన్ని రథ సప్తమి పూజలకు ముస్తాబు చేశారు. మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి, ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలందుకున్న గ్రామదేవత

చౌడేపల్లె: మండలంలో పరికిదొనలోని చింతపర్తి గుంటి గంగమ్మ నూతన ఆలయంలో సోమవారం గ్రామదేవత విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, కలశారాధన, చండీ హోమ పూజలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండి, పాడి సంపద వృద్ధి చెందాలని కోరుతూ మహిళలు మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదానం చేశారు.



కలశాలతో వెళ్తున్న గ్రామస్తులు

ఘనంగా వసంత పంచమి







వసంత పంచమి వేడుకల్లో విద్యార్థులు, కల్లూరు హైస్కూల్లో సరస్వతీదేవికి చేసిన పూజల్లో ఉపాధ్యాయ బృందం, చౌడేపల్లె: సరస్వతీదేవి అలంకరణలో వైష్ణవిదేవి

పలమనేరు: పట్టణంలోని సరస్వతి ఆలయంలో వసంతి పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహా గణపతి, సరస్వతి హోమాలను నిర్వహించి పలువురు పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలతో హాజరయ్యారు. ఇక స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కల్లూరు హైస్కూల్లో..

పులిచెర్ల(కల్లూరు): వసంత పంచమి సందర్భంగా సోమవారం కల్లూరు హైస్కూల్లోని సరస్వతీదేవి ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామచంద్ర అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజార్చనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వీ.సిద్ధులు, ప్రకాష్, సుభాషిణి, రేణుక, సిద్ధయ్య, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో వైష్ణవీదేవి

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్లలో చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో వైష్ణవీదేవిని కొలువు దీర్చారు. సోమవారం వసంత పంచమి పురస్కరించుకుని నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. బుద్ధి, జ్ఞానం, విద్యను ప్రసాదించాలని కోరుతూ మహిళలు, విద్యార్థులు పూజలు చేశారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కుంభాభిషేకం



పూజా కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లెలోని శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో సోమవారం జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ, కుంభాభిషేకం, పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఆయన్ను సత్కరించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పురోహితులు ఆశీర్వచనం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట నాయకులు ఉదయ్, అశోక్, మురళి పాల్గొన్నారు.



చారాలలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

చౌడేపల్లె: మండలంలో చారాలలోని శ్రీ అన్నపూర్ణాంబ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి భక్త జన సందడి నడుమ వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా ప్రతి ఏటా గ్రామంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

నేడు తిరునాళ్ల, ఉట్లోత్సవం

అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఉట్లోత్సవం, తిరునాళ్ల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆలయం వద్ద అన్నదానం చేస్తామని, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం స్వామివారిని గ్రామంలో ఊరేగిస్తారు. బుధవారం దోపోత్సవంతో తిరునాళ్ల ముగుస్తుంది.

మంచు కురిసే వేళ..!



పలమనేరు- మదనపల్లె జాతీయ రహదారిపై కమ్ముకున్న మంచు

గంగవరం: మండల వ్యాప్తంగాపొగ మంచు దట్టంగా కురుస్తోంది.9 గంటలు దాటినా మంచుతెరలు వీడకపోగా చలితీవ్రత కూడా పెరుగుతోంది. పల్లెటూళ్లలో ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తే ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి. జాతీయ రహదారులపై వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని వెళ్తున్నారు.

పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో నిర్లక్ష్యమేల..?



అధికారులకు సమస్యలు నివేదిస్తున్న నాయకులు

సదుం: జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలనే ఆదేశాలను అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఆక్షేపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం, అట్రాసిటీ నివారణ కోసం ప్రతి నెలా తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కలకటవారిపల్లెలో శ్మశాన వాటిక స్థల సమస్య జఠిలం కాకుండా చూడాలని కోరారు. చాలా మంది మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై దళిత సంఘ నాయకులు సీతాపతి అసహనం వ్యక్తం చేశారు. వారికి మెమో జారీ చేయాలని కోరారు. నడిగడ్డ పంచాయతీలో రమణయ్య మృతికి కారకులను అరెస్టు చేయాలని నాయకులు కోరారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూమిని మంజూరు చేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యంతో పలువురి ఎస్సీలకు ఉపాధిలో పని కల్పించలేదని.. ఇకనైనా సమస్య పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామచంద్రయ్య విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ హరిబాబు, డీటీ కుమార్, ఏఎస్ఐ వందన, హౌసింగ్ ఏఈ అరుల్, నాయకులు శ్రీనివాసులు, గిరిబాబు, ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ మాటేమిటి 'బాబూ'..?

- కుప్పం 2 రీచ్, 3వ రీచ్ పనులకు అటంకాలెన్నో..!
- 2020లో రద్దయిన విస్తరణ పనుల జీఓ
- పదేళ్లుగా రోడ్డు విస్తరణ పనులతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

పదేళ్ల క్రితం కుప్పంలో ఆగిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని మహా కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. వాస్తవానికి పదేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి కేవలం మొదటి రీచ్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారు నష్ట పరిహారం కోసం కోర్టును ఆశ్రయించడంతో మొదటి రీచ్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. బాధితులకు నష్ట పరిహారం చెల్లించడంలో అప్పట్లో అధికారంలో ఉన్నా టీడీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల్లో కూటమి నాయకులు మళ్లీ విస్తరణ పల్లవి అందుకున్నా ఇప్పటి వరకు అతీగతీ లేదని పట్టణ ప్రజలు నిట్టూరుస్తున్నారు.



పట్టణంలో జరగాల్సిన రోడ్డు విస్తరణ పనులు ఇవే

కుప్పం: రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి మొదటి రీచ్ వంద పడకల ఆస్పత్రి నుంచి పట్టణంలో ఎంఆర్ రెడ్డి సర్కిల్ వరకు పనులు అప్పట్లో చేశారు. పాత పేటలో నాలుగు భవనాల యజమానులు నష్ట పరిహారం కోసం కోర్టును ఆశ్రయించడం పాత పేటలో పూర్తిగా పనులు జరగలేదు. అధికారంలోకి వస్తే రెండు, మూడు రీచ్‌ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని నాయకులు అట్టహాసంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక నాయకులతోపాటు సంబంధిత అధికారులు ఆగిన పనుల పరిశీలనకే పరిమితమయ్యారనే విమర్శలొస్తున్నాయి.

పనులు రద్దు

మహా కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విస్తరణ పనులు పూర్తి చేయాలని, అధికారులు పనులు పరిశీలించారు. అయితే నాలుగు రోజుల క్రితం కడా పీడీ 2,3 రీచ్ ప్రాంతాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. 2019లోనే ఆర్అండ్‌బీ అధికారుల ప్రతిపాదనల మేరకు రోడ్డు విస్తరణ పనులు అప్పట్లోనే రద్దు చేశారని అధికారులు కడా పీడీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రద్దయిన పనులను మళ్లీ ఎలా చేయగలుగుతామని మండిపడ్డారు. మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తే తప్ప పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. ప్రస్తుతం ఇప్పుడున్న పరిస్థితుల్లో రోడ్డు విస్తరణపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కూటమి నాయకులే అడ్డు

పట్టణ నడిబొడ్డున రోడ్డు విస్తరణ పనులకు స్థానిక అధికార పార్టీ నేతలే అడ్డు తగులుతున్నారు. బస్టాండు నుంచి రైల్వే గేటు వరుకు ప్రధాన నేతల నివాస గృహాలు ఉన్నాయి. 2014లో ఇల్లు కోల్పోయిన వారికి సక్రమంగా నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండులో మున్సిపల్ అంగళ్లు, కాంప్లెక్స్‌లో 32 దుకాణాల్లో ఎక్కువగా అధికార పార్టీ నేతల చేతుల్లో ఉన్నాయి. ఈ దుకాణాలకు రోజువారీ బాడుగ కింద నెలకు వేలాది రూపాయలు దండుకుంటున్నారు. రోజుకు మున్సిపల్ దుకాణాలకు 600 నుంచి 1000 రూపాయిలకు వరకు వసూలు చేస్తున్నారు. అధికార పార్టీనేతలే విస్తరణ పనులకు అవరోధం కలిగిస్తున్నారనేది ప్రజల్లో నడుస్తున్న చర్చ. ఈ లెక్కన రోడ్డు విస్తరణ పనులు ఏమేరకు చేస్తారనేది చూడాల్సిందే!